డిఆర్‌ఒకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

టమోటా రైతులను ఆదుకోవాలి

డిఆర్‌ఒ రామకృష్ణారెడ్డికి సిపిఎం వినతి

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అనంతపురం సమీపంలో కక్కలపల్లి వద్ద ఉన్న టమోటా మార్కెట్‌లో జరుగుతున్న అక్రమ వసూళ్లపై సమగ్ర విచారణ జరపాలని, టమోటా రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి రామకృష్ణారెడ్డిని కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో రైతులు సుమారు 23 వేల హెక్టార్లలో టమోటా పంట సాగు చేస్తున్నారన్నారు. పండించిన పంటను రైతులు అనంతపురం నగరానికి సమీపంలో ఉన్న కక్కలపల్లి మార్కెట్, మదనపల్లి, పలమనేరు మార్కెట్లలో విక్రయిస్తున్నారని చెప్పారు. అయితే కక్కలపల్లి మార్కెట్‌లో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో రెండు మూడు రోజులుగా కక్కలపల్లి మార్కెట్ వద్ద రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారని చెప్పారు. మండీ వారు వసూళ్లు చేస్తున్న పది శాతం కమీషన్, అసోసియేషన్ పేరిట లారీల నుండి చేస్తున్న భారం తమపై పడుతుందని, బయటి నుండి వ్యాపారులను, లారీలను రానివ్వడం లేదని రైతులు చెబుతున్నారన్నారు. కక్కలపల్లి వద్ద 28 టమోటా మార్కెట్లలో వ్యాపారస్తులు, లారీ అసోసియేషన్ యాజమాన్యాల మధ్య విభేదాలు రావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టమోటా కొనుగోలులో కొందరి పెత్తనం జరుగుతున్నట్లు, లారీ అసోసియేషన్ పేరుతో రూ.500, స్థానిక మండీల మెయింటినెన్స్ పేరుతూ రూ.500 నుండి రూ.2500 వరకు అక్రమంగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయన్నారు. వీటిపై రైతులు ఆందోళనకు దిగడంతో వ్యాపారస్తులు మూడు రోజుల నుండి వేలం వేసే సమయంలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. జిల్లాలో ఉన్న టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వమే టమోటా మార్కెట్ ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మార్కెట్లో తీసుకుంటున్న 10 శాతం కమీషన్‌ను గరిష్టంగా తగ్గించాలి. ధర తక్కువ వున్న సమయంలో కమీషన్ మూడు నాలుగు శాతానికి మించకుండా ఉండాలన్నారు. ఒకసారి వేలం వేసి ధర నిర్ణయించిన తర్వాత ధర తగ్గించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెట్ శాఖ అధికారులు క్రమతప్పకుండా మార్కెట్‌ను పర్యవేక్షణ చేయాలన్నారు. అంతేకాక జిల్లాలో టమోటా పంట ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ. నల్లప్ప, ఎస్ నాగేంద్ర కుమార్, ఎం. బాల రంగయ్య, ఆర్‌వి. నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్. చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉలిక్కిపడ్డ తాడిపత్రి

◆ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటిపై దాడికి టిడిపి శ్రేణుల యత్నం

◆ వైసిపి నాయకులు కందిగోపుల మురళి ఇంటిపైనా దాడి

◆ ఇంటికి నిప్పు, వాహనాలు ధ్వంసం

◆ వైసిపి కార్యకర్త అడ్డు రఫీపై దాడి .. తీవ్ర గాయాలు

◆ రంగంలోకి పోలీసు బలగాలు

వివాదాలకు కేంద్రంగా మారిన తాడిపత్రిలో మంగళవారం సాయంత్రం ఉద్రిక్తత చోటు చేసుకుంది. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి పట్టణంలోకి వచ్చాడని తెలుసుకున్న టిడిపికి చెందిన కొందరు పట్టణంలో అలజడి సృష్టించారు. మాజీ ఎమ్మెల్యే ఇంటిపై దాడికి పాల్పడ్డారు. వైసిపి నాయకులు కందిగోపుల మురళి ఇంటికి నిప్పంటించారు. అతనికి చెందిన వాహనాలను ధ్వంసం చేశారు. వైసిపి కార్యకర్త అడ్డు రఫీపై దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని తాడిపత్రి నుంచి పంపించివేశారు.

దాడిలో ధ్వంసమైన కందిగోపుల మురళికి చెందిన వాహనాలు

ప్రజాశక్తి - తాడిపత్రి

అనంతపురం జిల్లాలోని తాడిపత్రి పట్టణంలో మరోమారు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ నాయకుడు కందిగోపుల మురళి వాహనాలను ధ్వంసం చేశారు. ఇంటికి నిప్పు పెట్టారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిపై కూడా జెసి ప్రభాకర్ రెడ్డి అనుచరులుగా భావిస్తున్న గుంపు దాడికి పాల్పడింది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పట్టణంలోకి ప్రవేశించరాదని ఆంక్షలు ఉన్నప్పటికీ ఆయన వచ్చారంటూ తెలుసుకున్న తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు ఈ దాడికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు చేరుకునేలోగా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. వైసీపీ నేత కందిగోపుల మురళి ఇల్లు దాదాపు అగ్నికి ఆహుతి అయింది. ప్రస్తుతం పోలీసులు బలగాలు రంగంలోకి దిగాయి. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మంగళవారం మధ్యాహ్నం తాడిపత్రికి వస్తున్న నేపథ్యంలో పోలీసులు కొండాపురం వద్ద ఆయనను అడ్డుకున్నారు. కానీ తాడిపత్రిలోని తమ ఇంటి వద్ద పని ముగించుకుని తిరిగి వెళ్తానని పోలీసులతో చర్చించి తాడిపత్రికి వస్తున్న సమాచారాన్ని టిడిపి వర్గీల అంతర్గత గ్రూపులలో చక్కర్లుకొట్టడంతో పెద్ద ఎత్తున టిడిపి కార్యకర్తలు పోగయ్యారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిని తాడిపత్రిలోకి రాకుండా అడ్డుకునే ప్రయత్నంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో వైసీపీ కార్యకర్త అడ్డు రఫీకి రక్త గాయాలయ్యాయి. పోలీసులు టీడీపీ కార్యకర్తలను నియంత్రిస్తూ అటు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని తాడిపత్రి నుండి పంపించారు. ఈ దశలో టిడిపి కార్యకర్తలు వైసీపీ నాయకులు మురళి ఇంటిపై దాడి చేశారు. మురళి ఇంటికి నిప్పు పెట్టి ఆయన సంబంధించిన ఇన్నోవా, ఒక కారు, ఒక స్కూటీని ధ్వంసం చేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసుల ఇంట్లోనే ఉన్న మురళిని రక్షణ కల్పించారు. సమస్య తీవ్ర రూపం దాల్చకుండా టిడిపి కార్యకర్తలు చెదరగొట్టారు. విషయం తెలుసుకున్న ఎస్పీ జగదీష్ తాడిపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

దాడిలో గాయపడ్డ అడ్డు రఫీ

పేదల కడుపు కొట్టకండి

సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఎటిపి అధికారి శ్రీరాములుతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రభుత్వ సబ్సిడీ బియ్యాన్ని కొంతమంది అక్రమార్కులు పక్కదారి పట్టించి పేదల కడుపు కొడుతున్నారని సిపిఎం నాయకులు రామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని పలుప్రాంతాలతోపాటు రాజీవ్‌కాలనీ పంచాయతీ పరిధిలో ఉన్న కాలనీల్లో మూడు నెలలుగా రేషన్ బియ్యం పంపిణీ చేయడం లేదన్నారు. కొందరు స్టోర్ డీలర్లు వచ్చిన బియ్యం వచ్చినట్లు పక్కదారి పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలని కోరారు. అనంతరం ఎటిపి శ్రీరాములుకు వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఎటిపి స్పందిస్తూ వచ్చేనెల నుంచి తప్పనిసరిగా నెలనెలా రేషన్ బియ్యం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్‌కాలనీ ఉపసర్పంచి మసూద్, కాలనీవాసులు సీనా, మోహన్, వన్నూరమ్మ, దస్తగిరమ్మ, మాబున్నీ, రాములమ్మ, లక్ష్మి, అనిత, నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'ప్రజాదర్బార్':ఎమ్మెల్యే

అనంతపురం కలెక్టరేట్ : నగరవాసుల సమస్యలను తెలుసుకుని త్వరితగితిన పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. మంగళవారం నగరంలోని 21వ డివిజన్‌లో 33వ సచివాలయం పరిధిలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణాలు, తాగునీరు, డ్రెయినేజీ వంటి సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఒక్కరితో ఓపికగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాయల్ మురళి, సాకే లక్ష్మీనరసింహా, తొండపాటి రమేష్, వెంకటేష్, పోతుల లక్ష్మీనరసింహులు, పావురాల శేఖర్, గుర్రం నాగభూషణ, సరోజమ్మ, కృష్ణం రఘు, పవన్, శేఖర్, వినోద్, రాము, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

కంపోస్టు యార్డులో చెత్త వేరుచేసే పనులు చేపట్టాలి

అనంతపురంకలెక్టరేట్ : నగరంలోని కంపోస్టు యార్డులో చెత్త వేరు చేసే పనులు చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న కంపోస్ట్ (డంపింగ్) యార్డునుకలెక్టర్ పరిశీలించారు. ఇందులో భాగంగా యార్డులో సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఇబ్బంది పడకుండా చెత్త వేరు చేసే పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో పొడి, తడి చెత్త సేకరణ చేయాలని, అన్నిచోట్ల యాక్టివిటీలను మొదలు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ పివిఎస్‌ఎన్ మూర్తి, ఇన్‌ఛార్జి సూర్యనారాయణ, డిఇ సుభాష్, తహశీల్దార్ హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యం అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

అనంతపురం క్రైం : నిత్యం అప్రమత్తంగా ఉంటూ అక్రమ మద్యం, మట్కా, గ్యాంబ్లింగ్, గుట్కాలపై ప్రత్యేక నిఘా వేయాలని ఎస్పీ పి.జగదీష్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. జిల్లా స్పెషల్ బ్రాంచి అధికారులు, సిబ్బందితో మంగళవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా ఉన్న స్పెషల్ బ్రాంచి సిబ్బంది పనితీరుపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా మట్కా, పేకాట, నిషేధిత గుట్కా పదార్థాల విక్రయాలు, అక్రమ రవాణాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలన్నారు. జిల్లాలో ఫ్యాక్షన్, శాంతిభద్రతలు సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈసమావేశంలో స్పెషల్ బ్రాంచి సిఐ ధరణీకిశోర్, ఎస్‌బి హెడ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను నిర్మూలిద్దాం

అనంతపురం కలెక్టరేట్ : మూఢ నమ్మకాల నిర్మూలనకు కృషి చేసిన మహారాష్ట్రకు చెందిన నరేంద్ర దబోల్కర్ ఆశయాలను కొనసాగించాలని జెవివి నగర గౌరవాధ్యక్షురాలు డాక్టర్ పి.ప్రసూన పిలుపునిచ్చారు. దబోల్కర్ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని సంగమేష్‌నగర్‌లో ఉన్న జెవివి కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూఢ నమ్మకాలను ఆసరాగా తీసుకుని కొంతమంది స్వామీజీల అవతారం ఎత్తి ప్రజల మన ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. అలాంటి వాటికి వ్యతిరేకంగా దబోల్కర్ పెద్ద ఎత్తున ఉద్యమమే చేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలకు మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నగర నాయకులు కె.వీరరాజు, గాంగేనాయక్, లక్ష్మీనారాయణ, బాబ్‌జాన్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న జెవివి నాయకులు

నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ధర్నాలో విద్యార్థిసంఘాల నాయకులు

కళాశాల ఎదుట ధర్నాలో పాల్గొన్న విద్యార్థినులు, నాయకులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

నిబంధనలు పాటించని నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్‌ఎఫ్ఐ, ఎఐఎస్‌ఎఫ్, బిసి విద్యార్థి సమాఖ్య నాయకులు స్థానిక నారాయణ కళాశాల ఎదుట విద్యార్థినులతో కలసి మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు రమణయ్య, బీసీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ అనంతపురం నగరంలోని నారాయణ గర్ల్స్ క్యాంపస్‌లో గత 4రోజుల నుంచి కనీసం తాగడానికి నీరు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నారాయణ విద్యాసంస్థలు ఇష్టం వచ్చినట్లు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలకు ఫీజులు రూపంలో వసూలు చేసుకొని కళాశాలలో కనీసం మౌలిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం నగరానికి కూతవేటు దూరంలో ఉన్న వైవి. శివారెడ్డి బిల్డింగ్‌లో నారాయణ గర్ల్స్ క్యాంపస్ నిర్వహిస్తున్నారన్నారు. కళాశాలకు అనుమతికి మించి 2200 మంది విద్యార్థినులను కళాశాలలో చేర్చుకున్నారన్నారు. ఒక్కొక్క విద్యార్థి నుంచి లక్ష రూపాయలు పైబడి డబ్బులు వసూలు చేసుకొని విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కళాశాల ప్రారంభం రోజు నుంచి ఇప్పటిదాకా పూర్తి స్థాయిలో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. ఒక గదిలో పది నుంచి 15 మంది విద్యార్థులను ఉంచారన్నారు. చీకటి గదిలో ఇరుకిరుకుగా సరైన వెలుతురు గాలి లేక మానసికంగా నైతికంగా విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఐదు రోజుల నుంచి కళాశాల, హాస్టల్‌లో కనీసం తాగడానికి నీరు లేదన్నారు. ఇతర అవసరాలకు కూడా నీరు లేదరన్నారు. సమస్యను విద్యార్థులు పలుమార్లు యాజమాన్యానికి చెప్పినా సమస్యను పరిష్కరిస్తామని చెబుతూనే కాలం వెల్లదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులు తమ సమస్యను తల్లిదండ్రులకు చెప్పుకోవడానికి ఇంటికి ఫోన్ చేస్తారన్న కారణంతో నారాయణ కళాశాలలో ఉన్న ఫోన్ సర్వర్ పనిచేయకుండా సమస్య బయటకు రాకుండా కళాశాల యాజమాన్యం కుట్ర పన్నిందని విమర్శించారు.కళాశాలలో ఉన్న ఎజిఎం హరి ప్రసాద్ విద్యార్థులకు తల్లిదండ్రులకు సమాధానం చెప్పలేక ఐదు రోజుల నుంచి కళాశాలకు రాకుండా తప్పించుకు తిరుగుతున్నారని అన్నారు. ఈ అంశంపై ఆర్ఐఒకి చెప్పినా సమస్యపై కళాశాల యాజమాన్యంతో మాట్లాడుతానని దాటవేత ధోరణి అవలంభిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నారాయణ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని నారాయణ కళాశాలకు తొత్తుగా మారిన ఆర్ఐఒపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, సిద్దు, పట్టణ అధ్యక్షుడు భీమేష్, పట్టణ నాయకులు గణేష్, సాయి, మంజు,ఉమామహేష్ నాయకులు సమీరు,తారక్, పవన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ ప్రత్యామ్నాయ విత్తనాలు అందించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అనంతపురం

అర్హులైన రైతులందరికీ ప్రత్యామ్నాయ సాగుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రాయలసీమ జిల్లాల వ్యవసాయ అధికారులతో వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ప్రతి ఉద్యోగీ రైతు శ్రేయస్సు కోసం పని చేయాలని సూచించారు. వేరుశనగ పంటను రైతులు ఎందుకు సాగు చేయలేదని జిల్లా వ్యవసాయ అధికారిని అడగా వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు చేయలేకపోయారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ప్రత్యామ్నాయ పంటలు అనుకూల వాతావరణం ఉన్నందున రాయితీ విత్తనాలు అందించాలని ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు వివరించారు. జిల్లాలో ప్రత్యామ్నాయ విత్తనాల కింద ఉలవలు, అలసందలు, పెసర, జొన్నలు, కొర్ర విత్తనాలను 80శాతం రాయితీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయా విత్తనాలు కావాల్సిన రైతులు వారి పరిధిలోని రైతు సేవాకేంద్రాల్లో తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ, ఆర్‌ఎఆర్‌ఎస్ నంద్యాల ఎడిఆర్ జాన్సన్, రేకులకుంట ప్రధాన శాస్త్రవేత్త విజయ శంకర్‌బాబు, కెవికె కో ఆర్డినేటర్ మల్లేశ్వరి, శాస్త్రవేత్త నారాయణస్వామి, ఆత్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ మద్దిలేటి, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.రవి, పద్మజ, వెంకట్‌రాముడు, మండల వ్యవసాయ అధికారులు శశికళ, శేఖర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, సాంకేతిక వ్యవసాయ అధికారులు బాలునాయక్, వెంకట్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం..పొంగిన వాగులు, వంకలు

ప్రజాశక్తి-గుత్తి

మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజామున వరకూ భారీ వర్షం కురిసింది. దీంతో 55.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గుత్తి నుంచి కసాపురానికి వెళ్లే రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక మండలంలోని లచ్చానుపల్లి గుంతకల్లు మండలంలోని కొంగనపల్లి గ్రామాల మధ్య ఉన్న వంక పొంగిపొర్లింది. దీంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే మండలంలోని శ్రీపురం వద్ద వంక పారుతుండడంతో తుఫాన్ వాహనం పట్టుతప్పి వంకలోకి పడిపోయింది. గమనించిన స్థానికులు వాహనంలోని డ్రైవర్‌ను రక్షించారు. గుత్తి, ఆర్‌ఎస్ లలో వర్షం నీరు రోడ్లపై నిలిచిపోయింది. దీంతో ద్విచక్ర వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

గండి పూడ్చివేత

గండిని పూడుస్తున్న అధికారులు

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని సంతే కొండాపురం గ్రామపంచాయతీలో ఉన్న పెద్ద చెరువు తూము వద్ద పడిన గండిని ఎట్టకేలకూ అధికారులు పూడ్చివేశారు. ఇటీవల భారీగా కురిసిన వర్షం కారణంగా పెద్ద చెరువుకు నీరు వచ్చి తూము వద్ద రంద్రం ఏర్పడటంతో నీరు లీకేజీ అయింది. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ డిఇఇ దామోదర్, ఏఈ అనిల్, తదితరులు స్థానిక సర్పంచి భర్త మల్లికారున సహకారంతో గండిని పూడ్చివేశారు. దీంతో కొండాపురం గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల రైతుసంఘం మాజీ అధ్యక్షులు ఓబులేష్, డీలర్ నల్లమల, వీఆర్వో నాగేంద్ర, వీఆర్‌ఏ నాగరాజు, స్కూల్ కమిటీ ఛైర్మన్ సోమశేఖర్, టిడిపి నాయకులు నరసింహులు, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్నానది

ప్రవహిస్తున్న పెన్నానది

పామిడి : ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు మంగళవారం మండల పరిధిలోని పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తోంది. చాలారోజుల తర్వాత పెన్నానది పొంగి ప్రవహించడంతో పరిసర గ్రామాల రైతులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి వీక్షించారు. ఇక ఎండాకాలంలో కూడా తమకు నీటి బాధలు ఉండవని హర్షం వ్యక్తం చేశారు.

నగరంలో కూలిన చెట్లు

అనంతపురం కార్పొరేషన్ : నగరంలో రాత్రి కురిసిన వర్షాలకు పలుప్రాంతాల్లో పడిన చెట్లను అధికారులు తొలగించారు. సోమవారం రాత్రి నగరంలోని అరవింద నగర్, రామ్‌నగర్, కోవూరునగర్‌తో పాటు పలుచోట్ల భారీ చెట్లు పడిపోయిన విషయం తెలిసిందే. దీనికితోడు చాలాచోట్ల మురుగునీరు రోడ్లపై రావడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈమేరకు మేయర్ మహమ్మద్ వసీం మంగళవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్యంతోపాటు చెట్ల తొలగింపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త వహించాలన్నారు. వ్యర్థాలను కాలువల్లో వేయకుండా చెత్త బండి వచ్చినప్పుడు మాత్రమే వేయాలని సూచించారు. ముఖ్యంగా అధికారులు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, కమల్‌భూషన్, ఇఇ సూర్యనారాయణ, హార్టికల్చర్ ఎడి ప్రసన్నలక్ష్మి, శానిటేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి మండలంలో పొంగి పొర్లుతున్న వంక

300 ఎకరాల్లో పంట నష్టం

అనంతపురం : ఇటీవల కురిసిన వర్షాలకు 15 మండలాల్లోని 38 గ్రామాల్లో 300 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమా మహేశ్వరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేరుశెనగ పంట 174 (హెక్టార్లలో), మొక్కజొన్న 163, కంది 138, వరి 26, పెసలు 15, ఆముదం 4, 195 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఆయా పంటల నష్టం సుమారు రూ.156.4 లక్షలు ఉంటుందని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

మోగా అభిమానుల రక్తదాన శిబిరం

పాల్గొన్న ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి

రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సినిమాల్లో మాత్రమే కాదు.. సేవా కార్యక్రమాల్లో కూడా చిరంజీవి మెగాస్టార్ అని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కొనియాడారు. చిరంజీవి అభిమాన సంఘం ఆధ్వర్యంలో చిరంజీవి అభిమాన యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భవానీ రవికుమార్‌తో పాటు వందలాది మంది చిరంజీవి, రాంచరణ్ అభిమానులు మంగళవారం నగరంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరంజీవి చాలా కష్టపడి సినిమాల్లో మెగాస్టార్ స్థాయికి వెళ్లారన్నారు. ఆయన ప్రతి అడుగూ ఆదర్శంగా ఉంటుందన్నారు. కేవలం సినిమాల్లో మాత్రమే కాకుండా సేవా కార్యక్రమాల్లో కూడా ఆయన అగ్రగామిగా నిలిచారన్నారు. అనంతరం బ్లడ్‌బ్యాంకు ఏర్పాటుచేసిన భవాని రవికుమార్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాంచరణ్ అభిమాన సంఘ జిల్లా అధ్యక్షుడు ఇమామ్ హుస్సేన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కూచి హరి, చిరంజీవి అభిమాన సంఘం సభ్యులు చలపతి, చంద్రమౌళి, షామీర్, శేషాద్రి, కాయగూరల లక్ష్మీప్రసాద్, అకీరా సాగర్, చరణ్, సాయి చరణ్, వెంకీ, జెకే రమేష్, సురేష్, అరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం దారుణం : మేయర్

మాట్లాడుతున్న మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

కలకత్తాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య అత్యంత దారుణమని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఎపి జూనియర్ డాక్టర్లు చేస్తున్న నిరసనకు మేయర్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్లు చేస్తున్న నిరసనకు మానవతా దృక్పథంతో ప్రతిఒక్కరూ సంఘీభావం తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం వారి సమస్యలపై జూనియర్ డాక్టర్లు మేయర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, అనిల్‌కుమార్‌రెడ్డి, కమల్‌భూషణ్, మల్లెమీద నరసింహులు, ఎపి జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు హరికిరణ్, వైస్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, పలువురు డాక్టర్లు, హౌస్‌సర్జన్లు, తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణరెడ్డి మృతికి నివాళి

పామిడి : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండలంలోని కండ్లపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు సత్యనారాయణరెడ్డికి మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సోమవారం నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ చెన్నకేశవరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా ఎడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ వీరా కూడా సత్యనారాయణరెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

దోమల నిర్మూలన అందరి బాధ్యత : డిఎంహెచ్‌ఒ

రోనాల్డ్‌రాస్ చిత్రపటానికి నివాళులరిస్తున్న డిఎంహెచ్‌ఒ ఇబి.దేవి

ప్రజాశక్తి-అనంతపురం అర్బన్

దోమల నిర్మూలన అందరి బాధ్యతని డిఎంహెచ్‌ఒ ఇబి.దేవి సూచించారు. ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఆడ అనాఫిలిస్ దోమ ద్వారా మలేరియా వ్యాపిస్తుందని కనుగొన్న బ్రిటిష్ వైద్యుడు సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ రోనాల్డ్ రాస్ జయంతిని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ దోమలను నివారిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుజాత, డెమో త్యాగరాజు, ఆరోగ్య విద్య అధికారి గంగాధర్, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, మద్దయ్య, బాషా, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : దోమలను నివారించి వ్యాధులను అరికడదామని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు ప్రవీణ్‌కుమార్, సాదియ పిలుపునిచ్చారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు దోమల వల్ల మలేరియా, డెంగ్యూ, బోదకాలు, మెదడు వాపు, చికున్‌గున్యా వంటి వ్యాధులు వస్తాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ దోమలను నివారిస్తే వాధులను కూడా అరికట్టవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ బాలాజీ, పిహెచ్‌ఎన్ సరోజమ్మ, సూపర్‌వైజర్ ప్రమీలమ్మ, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని 17వ ఎన్నికల వార్డు కేరమ్మ కట్ట, గుగ్గురెట్టి ప్రాంతాల్లో వైద్య ఆరోగ్యశాఖ, మలేరియా రాయదుర్గం సబ్ యూనిట్ పరిధిలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్, ఆరోగ్య పర్యవేక్షకులు శాంతకుమారి ఆధ్వర్యంలో దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్యదర్శి ఓంకార్, ఆరోగ్య కార్యదర్శి ప్రమీల, నళిని, శోభ, సరళ, సునీత, మమత, అరుణ, తులసి, ఆశా కార్యకర్తలు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

తెగిన చెరువులకు మరమ్మతులు చేపట్టాలి

ఎమ్మెల్యే సురేంద్రబాబు

తెగిపోయిన ములకలేడు చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

భారీ వర్షాల కారణంగా నియోజకవర్గ పరిధిలో తెగిపోయిన చెరువులు, చెక్‌డ్యాములకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని శెట్టూరు బ్రహ్మసముద్రం మండలాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఇందులో భాగంగా ములకలేడు, గొల్లపల్లి గ్రామ సమీపంలో తెగిన చెరువులను ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. చెరువుల సామర్థ్యం, నీటినిలువ, ఆయకట్టు విస్తీర్ణం తదితర అంశాలపై చర్చించారు. తెగిపోయిన చెరువులు కుంటల్లో ఎన్నేళ్లుగా నీటినిలువ లేదనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఏళ్ల తరబడి నీటి నిలువలు లేకపోతే భారీ వర్షాలకు చెరువులు ఉన్నపలంగా గండిపడటం తెగిపోవడం జరుగుతుందని ఇరిగేషన్ పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఎమ్మెల్యేకు విన్నవించారు.

హోంగార్డులకు స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని వినతి

హోంగార్డులకు పక్కాగృహాలతోపాటు ఇంటి స్థలాలు కేటాయించాలని ఎమ్మెల్యే సురేంద్రబాబుకు పలువురు హోంగార్డులు విన్నవించారు. మంగళవారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద హోంగార్డులు మారిన పవన్, లక్ష్మన్న, సుధాకర్, కళ, వన్నమ్మ, తదితరులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు.

‘ఫిషింగ్’ కార్యకలాపాలను విస్తరించాలి : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాలో ఫిషింగ్ కార్యకలాపాలను విస్తరింపజేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కన్ఫరెన్స్ హాల్‌లో మత్స్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిషింగ్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనే అర్హులైన మత్స్యకారులకు గుర్తించి లైసెన్సులు జారీ చేయాలని సూచించారు. నీటి కొరత కారణంగా జిల్లాలో 25 శాతం మాత్రమే విత్తనోత్పత్తి సాధించిందని అనంతపురం సూపరెంటెండెంట్ ఇంజనీర్, హెచ్‌ఎల్సీతో సమన్వయం చేసుకుని లక్ష్యాలను సాధించుటకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, ఫిషరీష్ డీడీ శ్రీనివాసనాయక్, ఎఫ్‌డిఒలు ఫకీరయ్య, లక్ష్మీనారాయణ, ఆసీఫ్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

విదేశీ విద్య ప్రవేశాలకు గడువు పొడిగింపు

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం, బ్లెకింగ్ వర్శిటీ (స్వీడన్) సంయుక్తంగా ఇంటిగ్రేటెడ్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు చేసుకునేందుకు ఈనెల 24వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు రిజిస్టార్ ఎస్.కృష్ణయ్య తెలిపారు. ఈమేరకు మంగళవారం వర్సిటీ రిజిస్ట్రార్ ఛాంబర్‌లో ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శనరావు ఓ విద్యార్థికి అడ్మిషన్ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఫారెన్ అఫైర్స్ డైరెక్టర్ పి.సుజాత, అడ్మిషన్ డైరెక్టర్ ఆర్.కిరణ్మయి, విద్యార్థులు పాల్గొన్నారు.

25న అగ్రికల్చర్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ ఎన్నికలు

అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లా అగ్రికల్చరల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ ఎన్నికలను ఈనెల 25న నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పివి.సాయికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మంత్రి పయ్యావులను కలిసిన నలంద కళాశాల ఎజిఎం

బొకే అందజేస్తున్న ఎజిఎం రమేష్‌బాబు

అనంతపురం : రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను అనంతపురం నలంద జూనియర్ కళాశాల ఎజిఎం రమేష్‌బాబు, అడ్మిని స్ట్రేషన్ అధికారి డి.రమేష్‌బాబు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

డ్రిప్పు, స్ప్రింక్లర్లకు దరఖాస్తు చేసుకోండి

శింగనమల : మండల వ్యాప్తంగా బోరు బావులు కింద సాగు చేసే రైతులు డ్రిప్పు, స్ప్రింక్లర్ల కోసం ఆయా రైతు సేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పీడీ రఘునాథ్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని జూలాకాలువ గ్రామంలో రైతులను కలిసి డ్రిప్ పరికరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి బిందు, తుంపర సేద్యానికి సంబంధించి విరివిగా డ్రిప్పు , స్ప్రింక్లర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. కావున అర్హులైన రైతులందరూ డ్రిప్పు, స్ప్రింక్లర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఐఎఒ జి.దిలీప్‌కుమార్, నేటపిమ్ డిసిఒ భాస్కర్, కంపెనీ ప్రతినిధి ఓబులేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

పామిడి : ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన మండలంలోని పాళ్యం తండా గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త నారాయస్వామి నాయక్ కుటుంబానికి టిడిపి నాయకులు మంగళవారం రూ.26,500 ఆర్థికసాయం అందజేశారు. ఈకార్యక్రమంలో టిడిపి అనంతపురం పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధ్యక్షుడు రమేష్‌నాయక్, పార్లమెంట్ కార్యదర్శి రాజేష్‌నాయక్, బూత్ కన్వీనర్ మల్లికార్జున నాయక్, డీలర్ గురుమూర్తి నాయక్, డ్రమ్స్ మాస్టర్ సురేష్‌నాయక్, యానిమేటర్ అంజీనాయక్, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ ఎర్రిస్వామి, శ్రీనివాసులునాయక్, ఇంద్ర, తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి ఉచిత శిక్షణ

రాయదుర్గం : మండలంలోని 74 ఉడేగోళం గ్రామ పరిధిలోని టెక్స్‌టైల్ పార్కు ఆవరణలో ఈనెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్న టెట్, డీఎస్సీ ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో చేపట్టబోయే ఉపాధ్యాయుల ఎంపిక పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం ఉచిత శిక్షణను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 350 మంది ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్నారన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

బ్రహ్మసముద్రం : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ అవార్డు అందుకున్న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న ఇఒపిఆర్‌డి వెంకటనాయుడును మంగళవారం స్థానిక కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ దాసానాయక్, పంచాయతీ కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో అవినాష్, జూనియర్ అసిస్టెంట్ అచ్యుతానంద, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకా వేయించాలి

రాయదుర్గం రూరల్ : జాతీయ పశు వ్యాధి నివారణ పథకంలో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని వడ్రవన్నూరు, జుంజురంపల్లి, కెంచానపల్లి, కాశీపురం, మల్కాపురం గ్రామాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో జుంజురంపల్లి సర్పంచి వన్నూరుస్వామి, మల్కాపురం తిమ్మారెడ్డి, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

నేడు అధికారుల సమావేశం

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం మండలంలోని వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ప్రాథమిక సహకార సంఘం రికార్డుల కంప్యూటరైజేషన్‌కు సంబంధించి సమాచార సేకరణ, తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

రోడ్డుపై నీటిని తొలగించాలని నిరసన

ఆత్మకూరు : మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ వద్ద రోడ్డుపై ఉన్న వర్షం నీటిని తొలగించాలని సిపిఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పాల రామకృష్ణ, బండారు శివ, మండల సమైక్య కార్యదర్శి సరస్వతి, నల్లమ్మ, రైతుసంఘం మండల కార్యదర్శి రామాంజనేయులు, గోపాల్‌నాయక్, నాగరాజునాయక్, తులసీనాయక్, హనుమన్న, అశోక్, తదితరులు పాల్గొన్నారు

ఇంటింటి సర్వే చేపట్టాలి

మాట్లాడుతున్న బ్రహ్మసముద్రం తహశీల్దార్ సుమతి

పెద్దపప్పూరు : మండలంలోని ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్లు, చనిపోయిన వారి ఓటర్లను గుర్తించాలని తహశీల్దార్ బాలాజీరావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేలో కొత్తగా ఓటర్లు ఉంటే ఎక్కించడంతోపాటు చనిపోయిన వారు ఉంటే తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ టి.బాషా, ఆర్‌ఐ, విఆర్‌ఒలు, బిఎల్‌ఒలు, తదితరులు పాల్గొన్నారు

బ్రహ్మసముద్రం : మండలంలోని బిఎల్‌ఒలు ఇంటింటికీ వెళ్లి పక్కాగా ఓటరు లిస్టును తయారు చేయాలని తహశీల్దార్ సుమతి సూచించారు. మంగళవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో బిఎల్‌ఓలతో శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 21 నుంచి సెప్టెంబర్ 21వ తేదీ వరకూ స్పెషల్ సమ్మరీ రివిజన్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా బిఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటరు సర్వే చేపట్టి మార్పులు, చేర్పులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనాథ్, ఆర్‌ఐ నాగిరెడ్డి, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపొద్దు

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రఘురామమూర్తి

రాయదుర్గం రూరల్ : ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని ప్రిన్సిపాల్ రఘురామమూర్తి సూచించారు. మంగళవారం స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ , నియంత్రణ సంస్థ, మాస్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన హెచ్‌ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా హెచ్‌ఐవి ఎలా వస్తుంది.. ఎలా వ్యాపించదు.. అనే అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మాస్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు మేనేజర్ నీలకంఠ, ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని రైడ్స్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్ సూచించారు. ఎపి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు మంగళవారం ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మమత, ఐసి టిసి కంట్రోలర్ రవి ప్రసాద్, సంస్థ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై ఆరోపణలు తగదు

విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ శివకార్తీక్‌రెడ్డి

ప్రజాశక్తి-పామిడి

మండల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్న వైద్య సిబ్బందిపై అసత్య ఆరోపణలు చేయడం బాధాకరమని వైద్యాధికారి డాక్టర్ శివకార్తీక్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకున్నా వైద్య సిబ్బందిపై అసత్య ఆరోపణలు చేస్తూ రాతపూర్వకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఒకవేళ ఎవరైనా అవినీతికి పాల్పడితే పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేసిన వ్యక్తి, ఆయన పూర్తి చిరునామాతో ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందిపై అసత్య ఆరోపణలు చేస్తూ తమ మనోభావాలు దెబ్బతీసే ప్రయత్నాలను మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కమలాకర్, డాక్టర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బస్సులు నడపాలని ఎస్‌ఎఫ్‌ఐ వినతి

వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

గార్లదిన్నె మీదుగా మండలంలోని తరిమెలకు ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధు, ఉపాధ్యక్షులు తరిమెల గిరి డిమాండ్ చేశారు. ఈమేరకు అనంతపురంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ వినయ్‌కుమార్‌ను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని తరిమెల గ్రామానికి అనంతపురం మీదుగా వెళ్లే బస్సు సర్వీసు, గార్లదిన్నె మీదుగా వెళ్లే బస్సుల సర్వీసులను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇందుకు అసిస్టెంట్ మేనేజర్ స్పందిస్తూ రెండు, మూడు రోజుల్లో సర్వీసులను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం నగర కమిటీ నాయకులు భీమా, గణేష్, దూద్‌పీరా, విద్యార్థులు వినోద్, శ్రీకాంత్, జగదీష్, కృష్ణ, మనోజ్, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

అంచనాలు తయారు చేయండి : మేయర్

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని డ్రైవర్స్ కాలనీలో ఉన్న ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని మేయర్ మహమ్మద్ వసీం సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్మశాన వాటికను పరిశీలించారు. ఇందులో భాగంగా శ్మశాన వాటికకు ప్రహరీ లేనందువల్ల ఇబ్బంది పడుతున్నామని ముస్లిములు వాపోతున్నారన్నారు. శ్మశాన వాటికలో లైట్లు లేనందువల్ల రాత్రి వేళల్లో చీకటిగా ఉంటుందని, వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. శ్మశాన వాటికలో కూడా నడవడానికి ఇబ్బంది లేకుండా ఉండాలంటే పార్కింగ్ టైల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఇ సూర్యనారాయణ, షకీల్ షఫీ, కార్పొరేటర్లు సైఫుల్లా, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌ఎస్‌లో ఉన్న జెడ్పీ బాలిక ఉన్నత పాఠశాలను విద్యాకమిటీ ఛైర్మన్ కొనకొండ్ల సూరి మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా తాగునీరు వసతి, క్రీడా మైదానం, మరుగుదొడ్ల నిర్మాణాలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయాయని వాటిని పూర్తి చేయాలని హెచ్‌ఎం సీతారామాంజనేయులు కోరారు. క్రీడా మైదానంలో పెరిగిన పిచ్చి మొక్కలు, కంపచెట్లను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

వజ్రకరూరు : ధర్మవరానికి చెందిన రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చౌడేశ్వరీదేవి వీవర్స్ సంక్షేమ సంఘం సహకారంలో మంగళవారం ఉరవకొండలోని చౌడేశ్వరీదేవి తొగటవీర కళ్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణుల ఉచితంగా పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక సభ్యులు వేల్పుల శ్రీనివాసులు, పెద్దకోట్ల రవి, గట్టు ఎర్రిస్వామి,పెద్దకోట్ల శ్రీనివాసులు, గుర్రం హరి, చందరాము కటికం మహేష్, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో చెత్త, చెదారం తొలగింపు

పామిడి : మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలోని పలువార్డుల్లో పేరుకుపోయిన డ్రెయినేజీలను మంగళవారం శుభ్రం చేశారు. పట్టణంలోని 16, 17, 18వ వార్డుల్లో డ్రెయినేజీ సమస్యతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న టీడీపీ నాయకుడు ఆర్‌ఆర్.రమేష్ తన సొంత నిధులతో ఆయా కాలనీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. కాగా పట్టణంలోని 4వ వార్డులో గుండెపోటుతో మృతిచెందిన ఇల్లూరు నాగరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత రూ.5వేలు ఆర్థికసాయం చేశారు. ఆయా కార్యక్రమాల్లో జింకల సంజీవకుమార్, నల్లబోతుల శీన, వడ్డే శివ, మహమ్మద్‌రఫీ, మంజు, ఆనంద్, శ్రీకాంత్, ఎర్రిస్వామి, ఆవుల శివ, పురుషోత్తం, తిమ్మప్ప, రవి, రాజేష్ నాయక్, ఆనంద్, రాజశేఖర్‌గౌడ్, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

పామిడి : బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎసి డిపిఒ నాగమణి, ప్రధానోపాధ్యాయులు రామ్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ‘బాల్య వివాహ రహిత భారతదేశం’ అనే విషయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎసిడిపిఓ విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ ఛైల్డ్ ప్రొటెక్షన్ ఉద్యోగులు రమాదేవి, జిఎంఎస్‌కె ఉద్యోగులు శారద, రాధా, ఆరోగ్యశాఖ ఉద్యోగులు సంతోషమ్మ, మహేశ్వరి, ఐసిడిఎస్ ఉద్యోగులు అనిత, జయంతి, జెఎల్.నారాయణమ్మ, సేకున్‌బి, ఆశావర్కర్ భానుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

రోడ్డుపై వేచి ఉన్న ప్రయాణికులు

ప్రజాశక్తి-గుత్తి

ఓ ఎపిఎస్ ఆర్టీసీ బస్సు మంగళవారం గుత్తిలో మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. అనంతపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అనంతపురం బస్టాండ్ నుంచి మంత్రాలయానికి బయలుదేరింది. ఈనేపథ్యంలో గుత్తిఆర్‌ఎస్ వద్దకు రాగానే సాంకేతిక సమస్య తలెత్తడంతో నిలిచిపోయింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సు డ్రైవరు మరమ్మతులు చేపట్టినప్పటికీ అది స్టార్ట్ కాలేదు. సుమారు గంటసేపు బస్సు మొరాయించడంతో ప్రయాణికులు మండుటెండలో అవస్థలు పడ్డారు. తర్వాత ఆ మార్గాన వెళ్తున్న ఇతర బస్సుల్లో ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేర్చారు.

రైతు అవగాహన సదస్సు

అనంతపురం : రూరల్ పరిధిలోని కొడిమి రైతు సేవాకేంద్రంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అనంతపురం సహాయ వ్యవసాయ సంచాలకులు శైలకుమారి మంగళవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ప్రకృతి వ్యవసాయం, సేద్య పద్ధతులు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏ పంటను సాగు చేయాలనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారులు వై.శ్రీనివాసులు, శంకర్‌లాల్ నాయక్, వ్యవసాయ విస్తరణ అధికారి సి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు పంపిణీ

అనంతపురం : గ్రీన్ ఆర్మీ, బిఎస్‌ఆర్ సిల్క్స్ సంయుక్తంగా నగరంలోని క్లబ్ ఎదురుగా ఉన్న బిఎస్‌ఆర్ సిల్క్స్ వద్ద మంగళవారం పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎజి ప్రమీలమ్మ మాట్లాడుతూ ‘అమ్మ పేరుపై మొక్క నాటుదం’ కార్యక్రమంలో భాగంగా దాదాపు 600 మొక్కలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి ఓ పండ్ల మొక్క ఉండాలన్నారు. తద్వారా ఆ చెట్లల్లో కాసే పండ్లు పక్షులకు పడితే హరిత అనంతకు దారి తీస్తుందన్నారు. ఇప్పటికే దాదాపు 21 గ్రామాల్లో 22 వేల పండ్ల మొక్కలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ విశాల ఫెర్రర్, నరసింహారెడ్డి, గ్రీన్ ఆర్మీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం : ఎస్పీ పి.జగదీష్‌ని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ ఛాంబర్‌లో ఎస్పీని కలిసి పూల మొక్క అందజేసి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

పుట్లూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఎస్ఐ హేమాద్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, డ్రగ్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. అలాగే ఫోన్‌లో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి మెసేజ్‌లు వచ్చినప్పుడు ఎవరికీ ఓటీపిలు చెప్పవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

పామిడి : స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా150 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 62 మందిని శస్త్ర చికిత్సకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, లయన్స్ క్లబ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు పట్రా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జయరామ్‌రావు, జాయింట్ సెక్రటరీ రోషన్ జమీర్, కోశాధికారి షేక్షావలి, మెంబర్‌షిప్ ఛైర్‌పర్సన్ శాంతిప్రియ, డైరెక్టర్లు సుహాన్‌కుమార్, గంగ శేఖర్, ముండే షేక్షావలి, ప్రసాద్, సురేష్, నారాయణమూర్తి, బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజర్ శివ, వాసవీ కళ్యాణ మండపం అధ్యక్షుడు ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కిసాన్ డ్రిప్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

రూ . 30 లక్షలు ఆస్తి నష్టం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

పట్టణ సమీపంలోని కిసాన్ డ్రిప్ ఫ్యాక్టరీ వద్ద మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.30 లక్షలు ఆస్తి నష్టం జరిగినట్లు యజమాని సాయిరాం ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రోజూ మాదిరిగానే ఫ్యాక్టరీ వద్ద నాసిరకం డ్రిప్పు పరికరాలు, కొత్త తయారీ డ్రిప్ కట్టలను రైతులు యథావిధిగా తీసుకెళ్తున్నారు. నూతనంగా పంటలు సాగు చేసే రైతులు పెద్దసంఖ్యలో నాసిరకం పరికరాలను ఫ్యాక్టరీ వద్దకు తీసుకొచ్చారన్నారు. వాటి విలువ సుమారు రూ. 30 లక్షల నుంచి 40 లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు ఉద్దేశపూర్వంగానే ఫ్యాక్టరీ పక్కనే నిల్వ ఉంచిన డ్రిప్ పరికరాలకు నిప్పు పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో వాటిని అదుపు చేయడం ఎవరి సధ్యం కాలేదన్నారు. గుర్తించిన ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఆ శాఖ సిబ్బంది అగ్నికీలను ఆర్పే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ రవిబాబు, పట్టణ సిఐ హరినాథ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.